

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



మంగళవారం 10-11-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :142 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

టపాసుల మోత.. కంటి గాయాల పోటు!



బాణసంచాతో 32 మందికి కంటి గాయాలు

ఆరుగురికి తీవ్ర గాయాలు

బాధితుల్లో చిన్నారులే అధికం

ఒకరి పరిస్థితి విషమం

సరోజినీ ఆసుపత్రికి బాధితుల క్యూ

అత్యవసర వైద్యానికి ఆసుపత్రి సిద్ధం

స్థానిక పోరులో కూటమి క్లీన్‌స్వీప్!

2024 కంటే మెరుగైన ఫలితాలు

పట్టణాల్లో 59 శాతం ఓట్లతో ఆధిక్యం

94 శాతం స్ట్రైక్ రేట్ నమోదు

వైసీపీపై 25.34 శాతం ఓట్ల ఆధిక్యం

అభివృద్ధికి ప్రజల ఆమోదం: చంద్రబాబు

ఎన్నికల ఖర్చులు తగ్గడం శుభపరిణామం

సేవాభావంతో రాజకీయాల్లోకి రావాలి



న్యూస్ డెస్క్, 09 నవంబర్ (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజలు అఖండ విజయాన్ని అందించారని సీఎం చంద్రబాబు అన్నారు. 2024 ఎన్నికలతో పోలిస్తే ఈసారి మరింత మెరుగైన ఫలితాలు వచ్చాయన్నారు. ప్రజల నుంచి లభించిన ఆదరణకు ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. ఈ విజయంతో రాష్ట్ర ప్రజలు తన ఆలోచనలకు అనుగుణంగా తీర్పు ఇచ్చారని వ్యాఖ్యానించారు. పట్టణ ప్రాంతాల్లో కూటమికి 59 శాతం ఓట్లు వచ్చాయని, 94 శాతం స్ట్రైక్ రేట్ నమోదైందని వెల్లడించారు.

అండాల దందాపై మహిళా కమిషన్ ఫైర్!

ఐదు ఫెర్టిలిటీ కేంద్రాలకు నోటీసులు

సుమోటోగా కేసు నమోదు

కమిషన్ ఎదుట హాజరైన నిర్వాహకులు

ఆసుపత్రుల రికార్డుల సమగ్ర పరిశీలన

నిబంధనల ఉల్లంఘనపై ఆరా

మహిళలను మోసగించారా? కోణంలో విచారణ

బాధితులకు న్యాయం చేస్తామన్న కమిషన్ 2 లో

ఓటమి దెబ్బకు ట్రంప్ యూటర్న్!

ఎన్నికల దెబ్బకు ట్రంప్ స్వరం మార్పు

ఇమ్మిగ్రేషన్ పాలసీ కఠినమని అంగీకారం

డెమోక్రాట్లతో కలిసి పనిచేసేందుకు సిద్ధం

ఆరు నెలలు విమర్శలకు దూరంగా ఉంటా

వలసల కఠిన చర్యలతో నష్టమని ఒప్పుకోలు

పాత వలసదారుల బహిష్కరణపై ప్రజల్లో ఆందోళన

ట్రంప్ వ్యాఖ్యలపై కొనసాగుతున్న ఉత్కంఠ



న్యూస్ డెస్క్, 09 నవంబర్ (ఇది కద నిజం): అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలిన నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వరం మార్చారు. తన ప్రభుత్వ వలస విధానం (ఇమ్మిగ్రేషన్ పాలసీ) చాలా కఠినంగా ఉందని అంగీకరించారు. రాబోయే రోజుల్లో డెమోక్రటిక్ పార్టీతో కలిసి పనిచేయడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ఎన్నికల ఫలితాల అనంతరం సీబీఎస్ '60 మినిట్స్' కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ.. అక్రమ వలసలపై తమ ప్రభుత్వం తీసుకున్న కఠిన చర్యలు ఎన్నికల్లో ఒకవైపు మేలు చేసినా, మరోవైపు నష్టం కూడా కలిగించాయని అంగీకరించారు. సరిహద్దులను మూసివేయడం, నేరస్థులను దేశం నుంచి పంపించివేయడం వంటి అంశాల్లో తనకు మంచి మార్కులు పడ్డాయని, అయితే ఏళ్ల తరబడి అమెరికాలో స్థిరపడి, మంచి ఉద్యోగాలు చేస్తూ, పన్నులు కడుతున్న వారిని కూడా దేశం నుంచి బహిష్కరించడం (డిపోర్టేషన్) పట్ల ప్రజల్లో ఆందోళన వ్యక్తమైందని తెలిపారు.

ఉద్యోగులకు పాత పెన్షన్ వరం!

అర్హులైన సీపీఎస్ ఉద్యోగులకే వెసులుబాటు

2004కు ముందున్న నోటిఫికేషన్లే ప్రామాణికం

నిధి పోర్టల్‌లో దరఖాస్తుల స్వీకరణ

నాలుగు కీలక పత్రాలు తప్పనిసరి

అధికారుల ఆమోదంతోనే పెన్షన్ మార్పు

ఓపీఎస్‌తో జీపీఎఫ్ ఖాతా కేటాయింపు

మళ్లీ సీపీఎస్‌లోకి వెళ్లే అవకాశం లేదు

డిసెంబర్ 31తో ముగియనున్న గడువు 2 లో

భాగ్యలక్ష్మి ఆలయానికి భక్తజనసంద్రం!

చార్మినార్‌లో పండుగ సందడి

భక్తుల కోసం 10 క్యూ లైన్లు

మూడు రోజుల పాటు భారీ రద్దీ

ఆలయం వద్ద భారీ బందోబస్తు

చార్మినార్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు 2 లో

వాహనదారులకు పోలీసుల కీలక సూచనలు

బాకీలన్నీ తీర్చేస్తాం.. అంబటి మాస్ వార్నింగ్!



న్యూస్ డెస్క్, 09 నవంబర్ (ఇది కద నిజం): అవన్నీ బాకీనేనని, తాము వచ్చిన తర్వాత తీర్చేస్తామని మాజీ మంత్రి అంబటి రాంబాబు హెచ్చరించారు. గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న లేళ్ల అప్పిరెడ్డిని పరామర్శించిన నేపథ్యంలో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

పండుగ వేళ కాలుష్య జ్వాల!



- దీపావళితో పెరిగిన వాయు కాలుష్యం!
- విషపూరితంగా మారిన భాగ్యనగరం గాలి!
- పటాకుల మోతతో పెరిగిన పీఎం2.5!
- ఐటీ కారిడార్‌లో ప్రమాద ఘంటికలు!
- 600 దాటిన ఏక్యూఐ స్థాయిలు!
- ఢిల్లీలో విషవాయువుల కోరలు!
- గ్యాస్ చాంబర్‌ను తలపిస్తున్న రాజధాని!
- హైదరాబాద్‌ను వెంటాడుతున్న కాలుష్య భయం!
- మరో ఢిల్లీగా మారనున్న భాగ్యనగరం?

న్యూస్ డెస్క్, 09 నవంబర్ (ఇది కద నిజం): ఐటీ హబ్‌గా, దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా గుర్తింపు పొందిన హైదరాబాద్ ఇప్పుడు కాలుష్య కోరల్లో చిక్కుకుంటోంది. ఒకప్పుడు ఆహ్లాదకరమైన వాతావరణానికి పేరుగాంచిన భాగ్యనగరంలో ప్రస్తుతం స్వచ్ఛమైన గాలి కరువవుతోంది. రోజురోజుకూ పెరుగుతున్న వాయు కాలుష్యం నగరవాసులను ఆందోళనకు గురిచేస్తోంది. తాజాగా హైదరాబాద్ నగరంపై దీపావళి పండుగ ప్రభావం పడింది. పలుచోట్ల పెద్దఎత్తున పటాకులు కాల్చడంతో నగరంలో గాలి నాణ్యత భారీగా క్షీణించి కాలుష్యం ఒక్కసారిగా పెరిగింది. గణాంకాల ప్రకారం హైదరాబాద్‌లో ఏక్యూఐలో 160 పాయింట్లకు గాలి నాణ్యత పడిపోయి కాలుష్యం 410 పాయింట్లకు చేరినట్లు సమాచారం.

మిగతాది 2 లో..

డీపీఆర్ లేదు.. టెండర్లు పిలిచారా?

డీపీఆర్ లేకుండానే టెండర్లు

ప్రజలు లేని పబ్లిక్ హియరింగ్

మూసీపై కేటీఆర్ ఫైర్

కరువు వేళ సుందరీకరణా?

తుగ్లక్ పాలనంటూ విమర్శలు

ప్రాజెక్టుపై స్పష్టతకు డిమాండ్



న్యూస్ డెస్క్, 09 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణ ప్రభుత్వం మూసీ సుందరీకరణను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ ప్రాజెక్టు అమలు తీరుపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఎలాంటి ముందుచూపు లేకుండా, ప్రజలకు నష్టం జరిగేలా చర్యలు ఉంటున్నాయని ఆరోపిస్తున్నారు. తాజాగా.. మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టు అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు.ప్రాజెక్టుకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించిన తీరుతోపాటు, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం కాకుండానే టెండర్లు పిలవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

రంగారెడ్డి కలెక్టర్‌కు 6 నెలల జైలు!



కోర్టు ధిక్కరణకు రూ.2 వేల జరిమానా

ఆదేశాలు బేఖాతరు చేయడంపై ఆగ్రహం

60 రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశం

గడువు దాటినా స్పందించని కలెక్టర్

ఉద్దేశపూర్వక ఉల్లంఘనగా నిర్ధారణ

అప్పీలుకు నాలుగు వారాల గడువు 2 లో

ఎన్నికల వరకే రాజకీయం.. ఆపై అభివృద్ధి!

కరీంనగర్ అభివృద్ధికి కలిసికట్టుగా కృషి

బండి సంజయ్‌తో కలిసి పనిచేస్తాం

పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల పూర్తి

జిల్లాకు నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు

అసంపూర్తి మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తి

ఆలయాలు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీకి చర్యలు



న్యూస్ డెస్క్, 09 నవంబర్ (ఇది కద నిజం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో అగ్రస్థానంలో నిలబెడతామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ఎన్నికల తర్వాత వ్యక్తిగత రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రయోజనాలు, జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులంతా కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ జిల్లాకు అవసరమైన అభివృద్ధి 2 లో

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
మంగళవారం 10-11-2026

పండుగ వేళ.. కాలుష్య జ్వాల!

మొదటి పేజీ తరువాయి

ముఖ్యంగా పశ్చిమ హైదరాబాద్ ఐటీ కారిడార్ పరిధిలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో ఏక్యూఐ ఏకంగా 600 పాయింట్లను దాటడం కాలుష్య తీవ్రతకు అద్దం పడుతోంది.

దీపావళి తర్వాత మరింత దిగజారిన పరిస్థితి..

ఇప్పటికే కాలుష్య సమస్యతో సతమతమవుతున్న హైదరాబాద్‌కు దీపావళి వేడుకలు గాలి నాణ్యతను మరింత దెబ్బతీసింది. పండుగ సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి దాటినా పటాకులు కాల్చడం కొనసాగింది. బంజారాహిల్స్, శ్రీనగర్ కాలనీ, పంజాగుట్ట, ఎస్ఆర్ నగర్, అమీర్‌పేట్, సోమాజిగూడ ప్రాంతాల్లో టపాసుల మోతతో గాలిలో పొగ, ధూళి కణాల సాంద్రత పెరిగింది. దీపావళి రాత్రి 9.30 గంటల సమయంలో హైదరాబాద్ నగర సగటు ఏక్యూఐ 509 పాయింట్లకు చేరినట్లు గణాంకాలు వెల్లడించాయి. పీఎం2.5 సాంద్రత క్యూబిక్ మీటరుకు 392 మైక్రోగ్రాములుగా నమోదైంది. సాధారణంగా పేర్కొన్న 60 మైక్రోగ్రాముల పరిమితితో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. అలాగే పీఎం10 స్థాయిలు కూడా 326 మైక్రోగ్రాములకు చేరినట్లు సమాచారం. సాధారణ పరిమితి 100 మైక్రోగ్రాములు కాగా, ప్రస్తుతం నమోదవుతున్న స్థాయిలు ఆందోళన కలిగిస్తున్నాయి. సోమవారం ఉదయానికి నగర సగటు ఏక్యూఐ 160 పాయింట్లుగా నమోదైంది.

దేశ రాజధాని ఢిల్లీలో గ్యాస్ చాంబర్‌ను తలపిస్తున్న పరిస్థితి..

ఇదిలా ఉంటే దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం మరింత ప్రమాదకరంగా మారింది. నగరాన్ని దట్టమైన పొగ కమ్మేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలుష్య నియంత్రణ కమిటీ గణాంకాల ప్రకారం.. నవంబర్ 9 తెల్లవారుజామున పంజాబీ బాగ్ ప్రాంతంలో పీఎం2.5 సాంద్రత క్యూబిక్ మీటరుకు ఏకంగా 993 మైక్రోగ్రాములకు చేరింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన 24 గంటల సగటు మార్గదర్శక పరిమితి 15 మైక్రోగ్రాములతో పోలిస్తే ఇది దాదాపు 66 రెట్లు అధికం. ఆర్.కే. పురంలో 61.6 రెట్లు, వివేక్ విహార్‌లో 58.2 రెట్లు అధికంగా కాలుష్యం నమోదైనట్లు నివేదికలు వెల్లడించాయి. బురారీ క్రాసింగ్‌లో ఏక్యూ×ఐ 441, రోహిణిలో 430 పాయింట్లుగా రికార్డయ్యాయి. ఆనంద్ విహార్, బవానా ప్రాంతాల్లో పర్యవేక్షణ కేంద్రాల డేటా అందుబాటులో లేకపోవడంతో వాస్తవ పరిస్థితిపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

మరో ఢిల్లీగా హైదరాబాద్?:

హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీ, నిర్మాణ పనుల నుంచి వెలువడే దుమ్ము, రోడ్లపై పేరుకుపోయిన ధూళి, పారిశ్రామిక ఉద్గారాలకు పండుగ కాలుష్యం తోడవడంతో పరిస్థితి చేయి దాటుతోంది. దీపావళి ప్రభావంతో తాజాగా గాలి నాణ్యత దారుణంగా పడిపోవడంతో ప్రభుత్వం, అధికారులు తక్షణం అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. లేక పోతే అతి త్వరలోనే హైదరాబాద్ కూడా మరో ఢిల్లీగా మారే ప్రమాదం ఉందని నిపుణులు, పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అండాల దందాపై మహిళా కమిషన్ ఫైర్!



న్యూస్ డెస్క్, 09 నవంబర్ (ఇది కద నిజం): రాష్ట్రంలో కలకలం రేపిన అండాల అక్రమ సేకరణ వ్యవహారాన్ని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణించింది. ఈ ఉదంతంపై మహిళా కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసి విస్తృత విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంలో ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదు ప్రముఖ ఫెర్టిలిటీ సెంటర్లకు మహిళా కమిషన్ ఇప్పటికే నోటీసులు జారీ చేసింది. అండాల సేకరణలో చట్ట నిబంధనలు పాటించారా లేదా? బాధిత మహిళల ఆరోగ్య భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని ఆదేశించింది. మహిళా కమిషన్ ఇచ్చిన నోటీసుల మేరకు సంబంధిత ఐదు ఫెర్టిలిటీ కేంద్రాల నిర్వాహకులు కమిషన్ ఎదుట హాజరయ్యారు. తమ ఆసుపత్రుల్లో జరిగిన అండాల సేకరణ విధానం, రోగుల వివరాలు, ఇతర సాంకేతిక సమాచారాన్ని అధికారులకు అందజేశారు.

రికార్డుల సమగ్ర పరిశీలన..

నిర్వాహకులు సమర్పించిన నివేదికలతో పాటు, ఆయా 5 ఫెర్టిలిటీ కేంద్రాలకు సంబంధించిన రికార్డులను మహిళా కమిషన్ అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏమైనా అక్రమాలు జరిగాయా? మహిళలను మోసగించి అండాల సేకరణకు పాల్పడ్డారా? అనే కోణంలో విచారణ వేగవంతం చేశారు. బాధిత మహిళలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మహిళా కమిషన్ స్పష్టం చేసింది.

ఓటమి దెబ్బకు ట్రంప్ యూటర్న్!

మొదటి పేజీ తరువాయి

వారితో కలిసి పనిచేయడానికి సిద్ధం:

ఇమ్మిగ్రేషన్ అంశంపై కలిసి పనిచేయడానికి కొందరు డెమోక్రాట్లు ఇప్పటికే తనను సంప్రదించారని, ఒప్పందం కుదరడానికి అవసరమైతే ఆరు నెలల పాటు డెమోక్రటిక్ నేతలను విమర్శించకుండా ఉండటానికి కూడా తాను సిద్ధమేనని ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఓ వైపు తన ఇమ్మిగ్రేషన్ విధానం మరీ కఠినంగా ఉందని ట్రంప్ అంగీకరిస్తూనే మరో వైపు ఎన్నికల ఫలితాల అనంతరం డెమోక్రటిక్ పార్టీతో కలిసి పనిచేయడానికి సిద్ధమని ఆయన ప్రకటించడం అమెరికా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

మాటలకే పరిమితమా?:

ఇమ్మిగ్రేషన్ పాలసీ కఠినంగా ఉందంటూ ఓ వైపు ట్రంప్ స్వయంగా అంగీకరించినప్పటికీ.. అమెరికా అధికారులు మాత్రం వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసిన సమయంలోనే అమెరికా ఇమిగ్రేషన్ విధానాల రూపకల్పనలో కీలకంగా వ్యవహరించిన స్టీఫెన్ మిల్లర్ హాట్ కామెంట్స్ చేశారు. మధ్యంతర ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ.. దేశంలో నేరాలకు పాల్పడే అక్రమ వలసదారులను ఏరివేసే ప్రక్రియను ఎట్టి పరిస్థితుల్లో ఆపబోమని స్పష్టం చేశారు. దీంతో ట్రంప్ వ్యాఖ్యలు కేవలం మాటలకే పరిమితం కాబోతున్నాయా లేక వలస విధానంలో ఏదైనా మార్పులు చోటు చేసుకోబోతున్నాయా అనేది కాలమే నిర్ణయించాల్సి ఉంది.

డీపీఆర్ లేదు.. టెండర్లు పిలిచారా?

మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

ప్రజలు లేకుండానే పబ్లిక్ హియరింగ్ నిర్వహించారని, డీపీఆర్ లేకుండానే ప్రాజెక్టు బిడ్లను ఆహ్వానించారని కేటీఆర్ ఆరోపించారు. ప్రజల అభిప్రాయాలు, ప్రాజెక్టు సమగ్ర వివరాలు లేకుండా ఇంత భారీ ప్రాజెక్టును ఎలా ముందుకు తీసుకెళ్తారని ప్రశ్నించారు. మూసీ సుందరీకరణ పేరుతో ప్రభుత్వం హడావుడి చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, నీటి సమస్యలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయని పేర్కొంటూ, ఇలాంటి సమయంలో సుందరీకరణ ప్రాజెక్టుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడాన్ని కేటీఆర్ తప్పుబట్టారు. ప్రజల అవసరాలు, ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా ప్రాజెక్టు విషయంలో ముందుకెళ్తున్నారని ఆరోపించారు.

"ప్రజలు లేకుండా పబ్లిక్ హియరింగ్.. డీపీఆర్ లేకుండానే ప్రాజెక్టు బిడ్లు పిలవడం.. ఇందులో విద్దూరం ఏంటంటే, రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్న సమయంలో 'సుందరీకరణ' పేరుతో హడావుడి చేయడం. ఇది తుగ్లక్ ప్రభుత్వం కాకపోతే మరేం అనాలో అర్థం కావడం లేదు" అంటూ కేటీఆర్ తన ట్వీట్‌లో వ్యాఖ్యానించారు.

మూసీ నది పునరుజ్జీవనం, సుందరీకరణ ప్రాజెక్టు హైదరాబాద్ అభివృద్ధికి సంబంధించిన కీలక అంశంగా మారింది. అయితే ప్రాజెక్టు వ్యయం, అమలు ప్రణాళిక, పునరావాసం, పర్యావరణ ప్రభావం, ప్రజాభిప్రాయ సేకరణ వంటి అంశాలపై రాజకీయంగా చర్చ కొనసాగుతోంది. ప్రభుత్వం ప్రాజెక్టు వివరాలు, టెండర్ల ప్రక్రియపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని కేటీఆర్ వ్యాఖ్యల ద్వారా ప్రతిపక్షం డిమాండ్ చేస్తోంది. అయితే ఆయన చేసిన ఆరోపణలపై ప్రభుత్వ స్పందన ఏవిధంగా ఉంటుందనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

స్థానిక పోరులో కూటమి క్లీన్‌స్వీప్!

మొదటి పేజీ తరువాయి

జెడ్పీటీసీ ఎన్నికల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో కూటమికి మంచి ఫలితాలు వచ్చాయని సీఎం చెప్పారు.

'పోస్టల్ బ్యాలెట్‌లోనూ కూటమికి అనుకూలంగా ఫలితాలు వచ్చాయి. మున్సిపల్ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా కూటమికి 60 శాతం ఓట్లు వచ్చాయి. పరిషత్ ఎన్నికల్లోనూ వైసీపీతో పోలిస్తే కూటమికి 30 శాతానికి పైగా అధిక్యం దక్కింది. ఉద్యోగుల ఓట్లు కూడా కూటమికి గణనీయంగా వచ్చాయి. 2024 ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి 55.3 శాతం ఓట్లు రాగా.. వైసీపీకి 39.81 శాతం ఓట్లు వచ్చాయి. స్థానిక ఎన్నికల్లో కూటమికి 58.9 శాతం, వైసీపీకి 33.56 శాతం ఓట్లు వచ్చాయి. రెండు పార్టీల మధ్య ఓట్ల తేడా 25.34 శాతం పాయింట్లు. 2024తో పోలిస్తే కూటమి ఆధిక్యం కూడా పెరిగింది' అని సీఎం చంద్రబాబు చెప్పారు.

'నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో మంచి రాజకీయాల ద్వారా సుపరిపాలన అందించాలనే నమ్మకంతో ముందుకు సాగుతున్నా. నా నమ్మకాన్ని ప్రజలు మరోసారి నిజం చేశారు. 2024లోనూ, ఇప్పుడు స్థానిక ఎన్నికల్లోనూ కూటమికి మెరుగైన ఆదరణ అందించారు. అభివృద్ధికి ఆమోదం, సుపరిపాలనకు గౌరవంగా ఈ ఎన్నికల ఫలితాలను భావిస్తున్నా. రాష్ట్ర ప్రజలకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నా. తుఫాన్ ప్రభావం ఉన్నప్పటికీ ఎన్నికల సమయంలో సహాయక చర్యలను కొనసాగించాము. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఫలితాలు కూడా కూటమికి వచ్చిన మద్దతును ప్రతిబింబిస్తున్నాయి' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

'ఎన్నికల్లో డబ్బు పంపిణీ, అనవసర ఖర్చులకు స్వస్తి పలకాల్సిన అవసరం ఉంది. డబ్బు ఖర్చు చేయడానికి బదులుగా నాయకులు సేవాభావంతో ప్రజల ముందుకు రావాలి. ఎన్నికల ఖర్చు తగ్గడం శుభపరిణామం. ఖర్చులు తగ్గితే నాయకుల్లో సేవాభావం పెరుగుతుంది. ఎన్నికల్లో పెట్టిన డబ్బును తిరిగి సంపాదించుకోవాలనే ఆలోచనకు రాజకీయ నాయకులు దూరంగా ఉండాలి. ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ జవాబుదారీతనంతో పనిచేసే నాయకత్వం పెరగాలి. రాజకీయాల్లో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉంది. ఆర్థిక అసమానతలు తగ్గి ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు లభించాలి. ప్రజలకు సేవ చేయడమే రాజకీయాల ప్రధాన లక్ష్యంగా ఉండాలి' అని సీఎం చెప్పుకొచ్చారు.

టపాసుల మోత.. కంటి గాయాల పోటు!

న్యూస్ డెస్క్, 09 నవంబర్ (ఇది కద నిజం): దీపావళి పండుగ వేళ బాణసంచా సంబరాలు పలువురి జీవితాల్లో విషాదాన్ని నింపాయి. టపాసులు కాల్చే సమయంలో ప్రమాదవశాత్తు పలువురు కంటి గాయాలపాలయ్యారు. హైదరాబాద్‌లోని మెహదీపట్నం ప్రభుత్వ సరోజినీ దేవి కంటి ఆసుపత్రికి ఇప్పటివరకు 32 మంది బాధితులు చికిత్స కోసం వచ్చినట్లు ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ ఇబ్రహీం వెల్లడించారు.

ఆరుగురికి తీవ్ర గాయాలు.. చిన్నారులే ఎక్కువ

ఆసుపత్రికి వచ్చిన 32 మందిలో ఆరుగురికి కంటి గాయాలు తీవ్రంగా ఉండటంతో వైద్యులు ఆసుపత్రిలో చేర్చుకున్నారు. వీరిలో ఒకరి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు డాక్టర్ ఇబ్రహీం తెలిపారు. ఆసుపత్రిలో చేరిన ఆరుగురిలో నలుగురు చిన్నారులు ఉండగా, మిగిలిన ఇద్దరిలో ఒకరు పెద్దవారు ఉన్నట్లు పేర్కొన్నారు. స్వల్ప గాయాలతో వచ్చిన మిగతా బాధితులకు ప్రథమ చికిత్స అందించి, అవసరమైన మందులు సూచించారు. తదుపరి వైద్య పరీక్షల కోసం మళ్లీ ఆసుపత్రికి రావాలని సూచించి పంపించారు.

అత్యవసర వైద్యానికి ఆసుపత్రి సిద్ధం

రానున్న రోజుల్లో దీపావళి సంబరాలు మరింత పెరిగే అవకాశం ఉండటంతో బాధితుల సంఖ్య కూడా పెరగవచ్చని వైద్యులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అత్యవసర వైద్య సేవలు అందించేందుకు సరోజినీ దేవి కంటి ఆసుపత్రి పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని ఆర్ఎంఓ స్పష్టం చేశారు.

పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

టపాసులు కాల్చే సమయంలో తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని డాక్టర్ ఇబ్రహీం సూచించారు. చేతిలో పట్టుకుని బాణసంచా కాల్చడం, ప్రమాదకరమైన విన్యాసాలు చేయడం వంటి పనులకు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటూ పండుగను సురక్షితంగా జరుపుకోవాలని సూచించారు.

భాగ్యలక్ష్మి ఆలయానికి భక్తజనసంద్రం!



న్యూస్ డెస్క్, 09 నవంబర్ (ఇది కద నిజం): చారిత్రాత్మక చార్మినార్ పరిసర ప్రాంతాలు భక్తజనసందోహంతో నిండిపోయాయి. పండుగ సంబరాల వేళ ప్రముఖ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. భక్తుల తాకిడి విపరీతంగా పెరగడంతో చార్మినార్ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీతో పాటు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

10 క్యూ లైన్లలో దర్శనాలు.. 3 రోజుల పాటు ప్రత్యేక రద్దీ

ఆలయానికి వచ్చే భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు కమిటీ నిర్వాహకులు ప్రత్యేకంగా 10 క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. భక్తులు ఎలాంటి తోపులాట లేకుండా ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకునేలా చర్యలు చేపట్టారు. రాబోయే మూడు రోజుల పాటు ఆలయానికి భక్తుల తాకిడి మరింత ఎక్కువగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో భద్రతా పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

చార్మినార్ మార్గంలో ట్రాఫిక్ డైవర్షన్స్.. పోలీసుల కీలక సూచన

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని చార్మినార్ పరిసర ప్రాంతాల్లో రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీసులు భారీగా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. చార్మినార్ వైపు వెళ్లే ప్రధాన మార్గాల్లో వాహనాల రాకపోకలను నిలిపివేసి, ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లిస్తున్నారు. చార్మినార్ మీదుగా ప్రయాణించే వాహనదారులు, స్థానికులు ఈ ట్రాఫిక్ ఆంక్షలను గమనించి తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. అత్యవసర పనులు ఉన్నవారు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుని పోలీసులకు సహకరించాలని సూచించారు.

బాకీలన్నీ తీర్చేస్తాం.. అంబటి మాస్ వార్నింగ్!



న్యూస్ డెస్క్, 09 నవంబర్ (ఇది కద నిజం): అవన్నీ బాకీనేనని, తాము వచ్చిన తర్వాత తీర్చేస్తామని మాజీ మంత్రి అంబటి రాంబాబు హెచ్చరించారు. గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న లేళ్ల అప్పిరెడ్డిని పరామర్శించిన నేపథ్యంలో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపై కూటమి నేతలు దాడులు చేసి అక్రమంగా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. గుంటూరులో ఎప్పుడూ లేని సంస్కృతిని తీసుకొచ్చారని మండిపడ్డారు. తాము సెలైంట్‌గా వైసీపీ కేడర్ మాత్రం ఒప్పుకోదన్నారు. 1989 నుంచి రాజకీయాల్లో ఉన్నామని, గుంటూరులో ఇలాంటి పరిస్థితిని ఎప్పుడూ చూడలేదని అంబటి రాంబాబు తెలిపారు. దుష్ట సంప్రదాయాన్ని గుంటూరులో చూస్తున్నామని, అక్రమంగా తమపై కేసులు పెడుతున్నారని చెప్పారు. ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయని ప్రశ్నించిన వైసీపీ నేత అప్పిరెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేసి జైలుకు పంపారని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తన తర్వాత ఎవరినీ వదిలిపెట్టమని అంబటి రాంబాబు హెచ్చరించారు.

రంగారెడ్డి కలెక్టర్‌కు 6 నెలల జైలు!

న్యూస్ డెస్క్, 09 నవంబర్ (ఇది కద నిజం): న్యాయస్థానం ఇచ్చిన స్పష్టమైన ఉత్తర్వులను బేఖాతరు చేసిన వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పునిచ్చింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన కేసులో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లుగా హైకోర్టు నిర్ధారించింది. జస్టిస్ కె.లక్ష్మణ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు కలెక్టర్‌కు 6 నెలల పాటు సాధారణ జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. అయితే, అప్పీలు చేసుకునేందుకు వీలుగా శిక్ష అమలును 4 వారాల పాటు నిలిపివేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

అసలు ఏం జరిగిందంటే..?

రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 22-ఏ ప్రకారం నిషేధిత ఆస్తుల జాబితా నుంచి కొన్ని ప్లాట్లను తొలగించాలంటూ బాధితులు దాఖలు చేసిన వినతిని పరిశీలించాలని గతంలో హైకోర్టు కలెక్టర్‌ను ఆదేశించింది. 2025 ఆగస్టులో కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం 60 రోజుల్లోగా ఆ వినతిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయితే, కోర్టు నిర్దేశించిన 60 రోజుల గడువు ముగిసినప్పటికీ కలెక్టర్ నుంచి ఎలాంటి రెస్పాన్స్ రాకపోవడంతో బాధితులు 2025 అక్టోబర్ 15న కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ నమోదైన తర్వాతే యంత్రాంగం కదిలింది. అధికారులు బాధితులకు నోటీసులు జారీ చేసి, 2026 ఫిబ్రవరి 26న వారి వినతిని తిరస్కరించారు. ఆ తర్వాత జులై 8న మరోసారి తిరస్కరణ ఉత్తర్వులు జారీ చేశారు. కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైన తర్వాతే ఇలా ప్రక్రియను చుట్టేయడంపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఉల్లంఘనపై విచారణ.. సంచలన తీర్పు

న్యాయస్థానం ఆదేశించిన సమయంలో స్పందించకుండా, పిటిషన్ దాఖలయ్యాక నామమాత్రంగానే ఉత్తర్వులు ఇవ్వడాన్ని తీవ్రంగా తప్పుబట్టిన హైకోర్టు, కలెక్టర్ ఉద్దేశపూర్వకంగానే కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని నిర్ధారించింది. ఐఏఎస్ స్థాయి అధికారి కోర్టు ఉత్తర్వులను నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని స్పష్టం చేస్తూ ధర్మాసనం కఠిన నిర్ణయం తీసుకుంది.

ఎన్నికల వరకే రాజకీయం.. ఆపై అభివృద్ధి!

మొదటి పేజీ తరువాయి

పనులను ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 70 నుంచి 90 శాతం వరకు పనులు పూర్తయి వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి కృషి చేస్తామని పొన్నం తెలిపారు. సింగరేణి, ఎన్టీపీసీ, గోదావరి జలసంపద వంటి వనరులు జిల్లాకు అపారమైన అభివృద్ధి అవకాశాలను కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. వీటిని సమర్థంగా వినియోగించుకుంటూ పారిశ్రామిక రంగం, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు.

విద్యారంగంలో మరిన్ని అవకాశాలు కల్పించేందుకు భీమదేవరపల్లిలో నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోనూ నవోదయ విద్యాలయం ఏర్పాటు కోసం ప్రతిపాదనలు చేశామని, జమ్మికుంట, హుస్నాబాద్‌లో కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నామని తెలిపారు. ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, ఫార్మసీ, ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్యా కోర్సులకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని పూర్తి చేయడంతోపాటు వైద్య సేవలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పర్యాటక, ఆధ్యాత్మిక రంగాల అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం, కొత్తకొండ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఎలగందుల ఖిల్లాతోపాటు ఇతర పర్యాటక ప్రాంతాలు, జలవనరుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామన్నారు. కరీంనగర్ నగరంలో వేగంగా పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా అర్బన్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. రాష్ట్రంలో పట్టణాభివృద్ధి కోసం దాదాపు వెయ్యి కొత్త పోస్టుల ఏర్పాటుకు ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

కరీంనగర్‌లో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పేదలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆర్థిక మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరినట్లు పొన్నం వెల్లడించారు. ప్రజలకు సంబంధించిన ఉమ్మడి సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొస్తే సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా అభివృద్ధికి అవసరమైన పనులపై జర్నలిస్టులు కూడా సూచనలు చేస్తూ భాగస్వాములు కావాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వీలైనన్ని నిధులు తీసుకొచ్చి ఉత్తర తెలంగాణలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన జిల్లాగా ఉమ్మడి కరీంనగర్‌ను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధిగా జిల్లా అభివృద్ధికి పాటుపడటం తన బాధ్యతని, ప్రజల ఆశీర్వాదంతో ఆ బాధ్యతను నెరవేరుస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

ఉద్యోగులకు పాత పెన్షన్ వరం!

న్యూస్ డెస్క్, 09 నవంబర్ (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) పరిధిలో ఉన్న ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం కీలక వెసులుబాటు కల్పించింది. అర్హులైన ఉద్యోగులు ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్)లోకి మారేందుకు ఒకేసారి అవకాశం కల్పిస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే ఈ అవకాశం రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగులందరికీ వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. నిర్దిష్ట అర్హతలు కలిగిన ఉద్యోగులు మాత్రమే ఓపీఎస్ లోకి మారేందుకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది.

నియామక నోటిఫికేషన్ తేదీ కీలకం

2004 సెప్టెంబర్ 1వ తేదీకి ముందే నియామక నోటిఫికేషన్ జారీ అయి ఉండాలి. ఆ నోటిఫికేషన్ ఆధారంగా 2004 సెప్టెంబర్ 1వ తేదీన లేదా ఆ తర్వాత ప్రభుత్వ ఉద్యోగంలో చేరి ప్రస్తుతం సీపీఎస్ పరిధిలో కొనసాగుతున్న ఉద్యోగులు మాత్రమే ఓపీఎస్ మార్పునకు అర్హులు. 2004 సెప్టెంబర్ 1 తర్వాత నియామక నోటిఫికేషన్ జారీ అయిన ఉద్యోగులకు ఈ అవకాశం వర్తించదు. ఉద్యోగంలో చేరిన తేదీ ఒక్కటే కాకుండా, నియామక నోటిఫికేషన్ జారీ అయిన తేదీ కూడా కీలకమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం విధుల్లో ఉన్న అర్హులైన ఉద్యోగులతో పాటు, ఇప్పటికే పదవీ విరమణ చేసిన అర్హులైన ఉద్యోగులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. అర్హులైన ఉద్యోగులు మరణించిన సందర్భాల్లో వారి కుడిడిఓ పరిశీలన తర్వాత తదుపరి ప్రక్రియ

ఉద్యోగి సమర్పించిన దరఖాస్తు, ధ్రువపత్రాలను డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్ (డిడిఓ) పరిశీలించాల్సి ఉంటుంది. ఈ పరిశీలన పూర్తయిన తర్వాత 10 పని దినాల్లో తదుపరి ప్రక్రియ కోసం దరఖాస్తును పంపించాలి. ఉద్యోగి అర్హత, సమర్పించిన పత్రాల పరిశీలన అనంతరం సంబంధిత కాంపిటెంట్ అథారిటీ తుది నిర్ణయం తీసుకుంటుంది. కేవలం దరఖాస్తు చేసుకున్నంత మాత్రాన ఓపీఎస్ కు మారినట్లు కాదని, అర్

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
మంగళవారం 10-11-2026

జాతీయ ఉత్తమ సామాజిక కార్యకర్త అవార్డుతో కుమ్మజెల్ల రాంబాబుకు ఘన సన్మానం

విజయవాడ, నవంబర్ 9 (ఇది కద నిజం)



జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 9న విజయవాడలో నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వరకట్న నిర్మూలన కోసం విశేష సేవలు అందిస్తున్న కుమ్మజెల్ల రాంబాబుని జాతీయ ఉత్తమ సామాజిక కార్యకర్త అవార్డుతో ఘనంగా సత్కరించారు.నేషనల్ హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు డాక్టర్ బొడ్డపాటి దాను, వర్కింగ్ ప్రెసిడెంట్ సముద్రాల ప్రకాష్ చేతుల మీదుగా ఆయనకు ప్రశంసాపత్రం, మెమెంటో అందజేశారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ..సమాజంలో వరకట్నం అనే సామాజిక దురాచారాన్ని నిర్మూలించేందుకు కుమ్మజెల్ల రాంబాబు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. వరకట్న రహిత సమాజ నిర్మాణం కోసం ఆయన చేస్తున్న పోరాటం యువతకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.అవార్డు గ్రహీత కుమ్మజెల్ల రాంబాబు మాట్లాడుతూ..ఈ జాతీయ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని అన్నారు.వరకట్న రహిత సమాజ నిర్మాణం, ఆడపిల్లల హక్కుల పరిరక్షణ కోసం తన పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. తన సేవలను గుర్తించి జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక చేసిన నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.సామాజిక దురాచారాల నిర్మూలనకు కృషి చేస్తున్న వ్యక్తులకు ఇలాంటి గుర్తింపులు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.

చిల్లర కాంటాల నిర్వాహకులతో మార్కెట్ అధికారుల కుమ్మక్కు?

పత్తి తూకాల్లో అక్రమాలు..కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మంగ బీరయ్య



జనగామ నవంబర్ 9(ఇది కద నిజం)

నెల్లుట్ల గ్రామ శివారులో నిర్వహిస్తున్న చిల్లర కాంటాల వద్ద పత్తి తూకాల్లో అక్రమాలు జరుగుతున్నాయని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలంగాణ పత్తి రైతుల సంఘం పట్టణ కార్యదర్శి మంగ బీరయ్య ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ జనగామ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.నెల్లుట్ల గ్రామ శివారులో రంగు లక్ష్మణ్, ఎడ్ల తిరుపతి, ఆలేటి లక్ష్మణ్, జీడికల్ శీను, ఆలేటి బాలరాజు, బసవగానే రమేష్, షేక్ నాగుల్ మీరా తదితరులు నిర్వహిస్తున్న చిల్లర కాంటాల వద్ద తూకాల్లో వ్యత్యాసాలు చోటుచేసుకుంటున్నాయని రైతుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు.లీగల్ మెట్రాలజీ శాఖ అనుమతులు, తూకపు యంత్రాల ధృవీకరణ లేకుండానే కొన్ని కాంటాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలపై సంబంధిత అధికారులు తక్షణమే విచారణ జరపాలని డిమాండ్ చేశారు. చిల్లర కాంటాల నిర్వాహకులతో మార్కెట్ అధికారులు కుమ్మక్కయ్యారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, రైతుల సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత కాంటాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, తూకపు యంత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు.తూకాల్లో అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రైతుల శ్రమను దోచుకునే అక్రమాలకు అడ్డుకట్ట వేసి, పత్తి రైతులకు న్యాయం చేయాలని మంగ బీరయ్య జిల్లా అధికారులను కోరారు.

సత్తుపల్లి ఏరియా జి.ఎం వెంకటాచారి కి కృతజ్ఞతలు.

ఐఎన్టీయూసీ నేత తీగల క్రాంతి కుమార్



సత్తుపల్లి,ఆర్ సి,నవంబర్09(ఇది కద నిజం) న్యూస్:

సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో పూర్తిస్థాయిలో అన్ని డిపార్ట్మెంట్ ల ఏర్పాటుకు కృషి చేసిన జనరల్ మేనేజర్ వెంకటాచారి ని మర్యాదపూర్వకంగా కలిసి సత్తుపల్లి ఏరియా ఉద్యోగుల అందరి తరపున కృతజ్ఞతలు తెలిపిన ఐఎన్టీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి తీగల క్రాంతికుమార్.తీగల క్రాంతికుమార్ మాట్లాడుతూ సత్తుపల్లి ఏరియా నుండి సింగరేణి సంస్థ వార్షిక ఉత్పత్తి లక్ష్యంలో అత్యధికంగా బొగ్గు ఉత్పత్తి మరియు రవాణా జరుగుతున్నప్పటికీ ఉద్యోగుల సౌకర్యార్థం సత్తుపల్లి ఏరియా జి.ఎం కార్యాలయంలో పర్సనల్ డిపార్ట్మెంట్ , ఫైనాన్స్ డిపార్ట్మెంట్ వివిధ డిపార్ట్మెంటు లేకపోవడం వల్ల ఉద్యోగులు ప్రతి చిన్న సమస్యకి కొత్తగూడెం వెళ్లి అనేక ఇబ్బందులు పడుతున్నటువంటి సందర్భంలో కార్మికుల పక్షాన ఐఎన్టీయూసీ యూనియన్ అభ్యర్థన మేరకు ఏరియా జనరల్ మేనేజర్ వెంకటాచారి చొరవతో సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బుద్ద ప్రకాష్ జ్యోతి మరియు సింగరేణి సంస్థ డైరెక్టర్ లను ఒప్పించి సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో అన్ని డిపార్ట్మెంట్లు ఏర్పాటుకు కృషి చేశారని తెలియజేశారు. అదేవిధంగా నూతనంగా ఏర్పడ్డ సత్తుపల్లి ఏరియాలో ఉద్యోగుల సౌకర్యం డిస్పెన్సరీ ఆధునికరణ , సింగరేణి గ్రౌండ్ , స్విమ్మింగ్ పూల్ వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. ఏరియా జనరల్ మేనేజర్ వెంకటాచారి మాట్లాడుతూ ఏరియాలో రక్షణ , నాణ్యతతో కూడిన బొగు ఉత్పత్తి , రవాణా సాధిస్తూ సింగరేణిలో సత్తుపల్లి ఏరియాను అగ్రగామిగా నిలుపుటకు ఉద్యోగులందరూ కృషి చేయాలని తెలియజేస్తూ కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం ఎప్పుడూ సహకరిస్తుందని తెలిపారు.

ఆకినేపల్లి మల్లారం రైతులకు ధాన్యం ఆరబోత స్థలం కేటాయించాలి

-- ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసిన రాజమల్ల సుకుమార్



ఇది కద నిజం మంగపేట, నవంబర్ 09:

ములుగు జిల్లా మంగపేట మండలం ఆకినేపల్లి మల్లారం గ్రామ రైతులు పండించిన వరి ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు ఎకరం స్థలాన్ని కేటాయించాలని రాజమల్ల సుకుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం మంగపేట ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో బద్రు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ధాన్యం ఆరబెట్టుకోవడానికి సరైన స్థలం లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాలు, ఇతర ఇబ్బందుల కారణంగా ధాన్యం నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. రైతుల సమస్యను అధికారులు పరిశీలించి, గ్రామంలో ఎకరం స్థలాన్ని కేటాయించి ధాన్యం ఆరబోతకు శాశ్వత పరిష్కారం చూపాలని రాజమల్ల సుకుమార్ విజ్ఞప్తి చేశారు.

నవంబర్ 15న నల్గొండ బహిరంగ సభను విజయవంతం చేయాలి

– తెలంగాణ రైతు సంఘం నాయకుల పిలుపు

లింగంపల్లిలో విస్తృతస్థాయి సమావేశం.. గ్రామస్థాయి నూతన కమిటీల ఏకగ్రీవ ఎన్నిక

చిల్పూర్, నవంబర్ 09(ఇది కద నిజం)

అఖిల భారత కిసాన్ సభ జాతీయ 36వ మహాసభల సందర్భంగా నవంబర్ 15న నల్గొండ పట్టణంలో నిర్వహించనున్న భారీ ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి పురామని శ్రవణ్, సీపీఎం పార్టీ మండల కార్యదర్శి సాదం రమేష్ పిలుపునిచ్చారు.చిల్పూర్ మండలం లింగంపల్లి గ్రామంలో నిర్వహించిన సీపీఎం విస్తృతస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై నాయకులు తీవ్ర విమర్శలు చేశారు.2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం పంట పెట్టుబడిపై 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధర కల్పిస్తామని, 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు.కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ దేశ ప్రజలకు ఆహార భద్రత కల్పించిన రైతుల భూములను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం మూడు నల్ల వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చిందని విమర్శించారు. ఢిల్లీ సరిహద్దుల్లో 13 నెలల పాటు సాగిన చారిత్రాత్మక రైతాంగ పోరాటంలో 750 మంది రైతులు ప్రాణాలు కోల్పోయిన అనంతరమే కేంద్ర ప్రభుత్వం ఆ చట్టాలను రద్దు చేసిందని గుర్తుచేశారు.

రైతాంగ హక్కుల కోసం అఖిల భారత కిసాన్ సభ పోరాటం

1936లో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఆవిర్భవించిన అఖిల భారత కిసాన్ సభ నేడు 1.58 కోట్ల సభ్యత్వంతో దేశంలోనే అతిపెద్ద రైతు సంఘంగా కొనసాగుతోందని నాయకులు తెలిపారు.తెలంగాణలో జమీందార్లు, జాగీర్దార్లు, వెట్టిచాకిరీ వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాడి, రక్షిత కౌలుదారీ చట్టం, భూసీలింగ్ చట్టాల సాధనలో కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు.రైతుల పంటలకు చట్టబద్ధమైన గిట్టుబాటు ధరలు కల్పించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి వడ్డీ లేని పంట రుణాలు, ఉచిత పంటల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగించే ఆలోచనను విరమించుకోవాలని, కరువు, తుఫానుల వల్ల నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించాలని కోరారు.అభివృద్ధి, ప్రత్యేక ఆర్థిక మండళ్లు, జాతీయ రహదారులు, విమానాశ్రయాలు, సౌర విద్యుత్ ప్రాజెక్టుల పేరుతో రైతుల భూములను బలవంతంగా సేకరించకూడదని స్పష్టం చేశారు. అమెరికాతో చేసుకునే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల దేశ రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు.రైతులందరూ ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

లింగంపల్లిలో నూతన గ్రామ కమిటీల ఎన్నిక

సమావేశంలో లింగంపల్లి గ్రామ సీపీఎం పార్టీతో పాటు అనుబంధ ప్రజాసంఘాల నూతన కమిటీలను ఏకగ్రీవంగా



ఎన్నుకున్నారు.సీపీఎం గ్రామ కార్యదర్శిగా ఆవుల ప్రభాకర్, కమిటీ సభ్యులుగా అపారదాపు, కర్రె నాగరాజు, అపారదాపు రవికుమార్, పురామని శ్రవణ్ ఎన్నికయ్యారు.తెలంగాణ రైతు సంఘం గ్రామ అధ్యక్షుడిగా కండ్లకోల్ ప్రవీణ్, కార్యదర్శిగా పురామని శ్రవణ్ ఎన్నికయ్యారు.కార్మిక సంఘం (సీఐటీయూ) గ్రామ అధ్యక్షుడిగా పెండ్లి రాజు, కార్యదర్శిగా అపారదాపు రాజకుమార్ ఎన్నికయ్యారు.భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) గ్రామ అధ్యక్షుడిగా బానోత్ గణేష్, కార్యదర్శిగా నాగబెల్లి సాయి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు ఆవుల ప్రభాకర్, అపారదాపు రాజు, కర్రె నాగరాజు, అపారదాపు రవికుమార్, అపారదాపు రాజకుమార్, కండ్లకోల్ ప్రవీణ్, నాగబెల్లి సాయి, బానోత్ రాజేందర్, బానోత్ గణేష్, పెండ్లి రాజు తదితరులు పాల్గొన్నారు.నవంబర్ 15న నల్గొండలో నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ జాతీయ మహాసభల భారీ ప్రదర్శన, బహిరంగ సభకు రైతులు, కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

కేసముద్రం మండలం లోని అన్ని గ్రామాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

మన ఇందిరమ్మ ఇంట్లో దీపావళి పండుగ సంబురాలు

ఇది కద నిజం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.

కేసముద్రం మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ముఖ్యంగా సొంత ఇల్లు లేని నిరుపేదలకు సొంతింటి కలను సాకారం







చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని చేపట్టిందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇల్లు అనేది కేవలం నాలుగు గోడల నిర్మాణం మాత్రమే కాదని, పేద కుటుంబానికి ఆత్మగౌరవం, భద్రత, భవిష్యత్తుపై భరోసా కల్పించే చిరునామా అని అన్నారు. దీపావళి పండుగ ప్రతి ఇంట్లో వెలుగులు నింపాలని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాలతోనూ పండుగ సంతోషాన్ని పంచుకోవాలనే ఆత్మీయ ఉద్దేశంతో పట్టు వస్త్రాలు అందజేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే మురళీ నాయక్, డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళీ నాయక్ సూచనలతో ప్రజలకు మరింత చేరువగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను ప్రజల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉందని, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు మాట్లాడుతూ గత పదేళ్లుగా ఉండడానికి గూడు లేక పాములతో,తేళ్ల భారిన పడి ఎక్కడ ఎంవుతావేమో అనే భయం తో,ఎండకు ఎండకు ఎండుతూ,వానకు తడుస్తూ ఎన్నో నిద్రలేని రాత్రులు గడుపుతూ రాత్రింబవళ్లు నరకయాతన చూసిన మాకు గత ఎలక్షన్స్ లో రేవంత రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం,శాసనసభ్యులు ఇచ్చిన మాట ప్రకారం మాకు ఇందిరమ్మ ఇల్లు కట్టించి మేము సమాజం లో గౌరవంగా బ్రతికేలా చేశారని,ఇందిరమ్మ ఇంట్లో ఈ రోజు దీపావళి జరుపుకోవడం ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం జేశారు.ఈ కార్యక్రమాల్లో పీసీసీ సభ్యులు దస్రు నాయక్ వివిధ గ్రామాల సర్పంచులు ఏదరబోయిన సూరయ్య,నంద్యా నాయక్, సంతోష్ నాయక్,శంకర్ నాయక్,కట్ల ఎల్లయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు నరేటి కొమురయ్య,జల్లె యాకంభ్రం,మిట్టగడుపుల యాకుబ్, గుగులోత్ రాము, నంద్యా,ఇందిరమ్మ కమిటీ సభ్యులు సిలివేరు లింగయ్య, పోలు నాగయ్య, ఈర్జాల మల్లికాంబ, కునుసోత్ బాలకిషన్, వాంకుడోత్ గంగ, కునుసోత్ సుమిత్ర, బానోత్ శంకర్, బోడ రమేష్ పాల్గొన్నారు. పార్టీ సీనియర్ నాయకులు ముంజల శ్రీనివాస్, పెరుమాండ్ల సోమయ్య, పోలు శ్రీనివాస్,గుండెపురి వెంకన్న,తొగరి తిరుపతి, ఏశబోయిన సంపత్, దేశభయిన అనిల్,తొగరి బిక్షపతి,ఇసంపల్లి యుగేందర్,కురిమిళ్ల భార్గవ్,గ్రామ పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీని మర్యాదపూర్వకంగా కలిసిన శింగనమల జడ్పీటీసీ ఎంపీటీసీలు

ఇది కద నిజం న్యూస్,శింగనమల.



నియోజకవర్గ పరిధిలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించిన జడ్పీటీసీ ఎంపీటీసీ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శింగనమల నియోజకవర్గ శాసనసభ్యురాలు బండారు శ్రావణి శ్రీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

విజయం సాధించిన అభ్యర్థులకు ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ శాలువాలు కప్పి మిఠాయిలు తినిపించి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ ప్రజలు మనపై ఎంతో నమ్మకం విశ్వాసంతో ఈ విజయాన్ని అందించారని ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని ఎమ్మెల్యే దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

గాయపడిన టీడీపీ నాయకులను పరామర్శించిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

ఇది కద నిజం న్యూస్, అనంతపురం.



అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శింగనమల మండలం పెరవలి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు రామ్మోహన్ కుల్లాయప్పలను శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ సోమవారం పరామర్శించారు.ఎన్నికల సందర్భంగా పెరవలి గ్రామంలో దొంగ ఓట్లను నివారించేందుకు ప్రయత్నించిన సమయంలో చోటుచేసుకున్న ఘర్షణలో రామ్మోహన్ కుల్లాయప్పలకు తలపై తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించిన ఎమ్మెల్యే శ్రావణి శ్రీ, బాధితులకు ధైర్యం చెప్పారు.అనంతరం వారి ఆరోగ్య పరిస్థితిపై అక్కడి వైద్యులతో మాట్లాడి బాధితులకు అత్యంత మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా పారదర్శకంగా ఎన్నికలు జరగడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని కోరారు.ఈ పరామర్శ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఈశ్వర్ రెడ్డి పార్టీ ప్రతినిధులు జి.సి. బాబు చిదంబరదొర చిదానంద నాయుడు బోడిపాటి ఆదినారసింహులు మరియు పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడుంబా తయారీ స్థావరాలపై పోలీసుల ఉక్కుపాదం!

- 9,600 లీటర్ల బెల్లం వాష్ ధ్వంసం..

-30 లీటర్ల గుడుంబా స్వాధీనం.. ముగ్గురు వ్యక్తులు అదుపులోకి

ఇది కద నిజం వెంకటాపురం(నూగూర్), నవంబర్ 09:



నిషేధిత గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడే వారిపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. గుడుంబా రహిత సమాజమే లక్ష్యంగా అక్రమ తయారీ స్థావరాలపై ఉక్కుపాదం మోపుతూ సోమవారం ఉదయం నూగూరు వెంకటాపురం సీఐ ముత్యం రమేష్ నేతృత్వంలో పోలీసులు విస్తృత తనిఖీలు, మెరుపుదాడులు నిర్వహించారు. వెంకటాపురం మండలం రామచంద్రపురం గ్రామ శివారులోని మూడు వేర్వేరు ప్రాంతాల్లో గుడుంబా తయారీ కేంద్రాలపై పోలీసులు ఏకకాలంలో దాడులు చేశారు. ఈ సందర్భంగా గుడుంబా తయారీ కోసం 48 డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన సుమారు 9,600 లీటర్ల బెల్లం వాష్‌ను పోలీసులు ధ్వంసం చేశారు. అలాగే అక్రమంగా తయారు చేసిన 30 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారీకి పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో నిషేధిత గుడుంబా తయారీ, విక్రయాల వల్ల ప్రజల ఆరోగ్యానికి, కుటుంబాల ఆర్థిక పరిస్థితికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు. ఈ దాడుల్లో నూగూరు వెంకటాపురం సీఐ ముత్యం రమేష్, ఎస్సైలు తిరుపతి రావు, తిరుపతి రెడ్డి, వెంకటాపురం పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
మంగళవారం 10-11-2026



సినిమా న్యూస్





నరకానికి కౌంట్‌డౌన్ షురూ!

తమిళ చిత్రసీమతో పాటు సౌత్ ఆడియన్స్‌ను తీవ్రంగా అలరించిన సూపర్ హిట్ హారర్ ఫ్రాంచైజీ 'డిమాంటి కాలనీ' నుంచి ఇప్పుడు మూడో భాగం రాబోతోంది. 'డిమాంటి కాలనీ 3: ది ఎండ్ ఈజ్ టూ ఫార్' పేరుతో తెరకెక్కుతున్న ఈ మోస్ట్ అవైటెడ్ మూవీకి టాలెంటెడ్ డైరెక్టర్ అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వం వహిస్తున్నారు.

ప్యాషన్ స్టూడియోస్, జ్ఞానముత్తు పట్టరై బ్యానర్లపై ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇక ఈ సినిమాలో అరుళ్‌నిధి, ప్రియా భవానీ శంకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా.. గురు సోమసుందరం, మీనాక్షి గోవిందరాజన్, అర్చన రవిచంద్రన్, మియా జార్జ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

సామ్ సిఎస్ ఈ చిత్రానికి గ్రాండ్ మ్యూజిక్ అందిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రం విడుదల తేదీని తాజాగా, దర్శకుడు సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. 'మీ క్యాలెండర్లలో గుర్తు పెట్టుకోండి.. నరకానికి కౌంట్‌డౌన్ మొదలైంది.. ఈ పొంగల్‌కు మీ పీడకల ఎదురుచూస్తోంది. చీకటే రాజ్యమేలుతుంది' అని పేర్కొంటూ వదిలిన పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ భయంకరమైన హారర్ థ్రిల్లర్‌ను 2027 పొంగల్ కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు దర్శకుడు స్పష్టం చేశారు.

'భోగి'కి సెన్సార్ బ్రేకులు!

టాలీవుడ్ చార్మింగ్ స్టార్ శర్వానంద్ వరుస సినిమాలతో ఫుల్ ఫామ్‌లో దూసుకుపోతున్నారు. ఆయన నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'భోగి' ఒకటి. పూర్తిగా తెలంగాణ గ్రామీణ నేపథ్య కథాంశంతో రాబోతున్న ఈ మూవీలో శర్వానంద్ ఇప్పటివరకు చూడని విధంగా పూర్తిగా రా అండ్ రస్టిక్ లుక్‌లో కనిపించబోతున్నారు. టాలెంట్ డైరెక్టర్ సంపత్ నంది ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుండగా, శర్వానంద్ సరసన అందాల భామ అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ నేపథ్యంలోనే సినిమాకు సంబంధించి ట్రైలర్‌తో పాటు ప్రీ-రిలీజ్ ఈవెంట్‌కు నవంబర్ 7న మేకర్స్ ప్లాన్ చేశారు.

కానీ చివరి నిమిషంలో ఊహించని విధంగా ఈ కార్యక్రమాలన్నీ వాయిదా పడినట్లు ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. దీంతో సినిమా విడుదల తేదీపై అభిమానుల్లో రకరకాల అనుమానాలు మొదలయ్యాయి. నిజానికి నవంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కావాల్సిన ఈ చిత్రం, చివరి నిమిషంలో సెన్సార్ సమస్యల కారణంగా వాయిదా పడినట్లు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. ట్రైలర్ విడుదల చేయకపోవడం, ప్రీ-రిలీజ్ ఈవెంట్‌ను రద్దు చేసుకోవడం, అలాగే మేకర్స్ నుంచి ఎలాంటి అధికారిక ప్రమోషన్స్ ప్రారంభం కాకపోవడం వంటి పరిణామాలు ఈ వాయిదా వార్తలకు మరింత బలం చేకూర్చినట్లయింది. శర్వానంద్ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ గ్రామీణ నేపథ్య చిత్రంపై భారీ అంచనాలున్నప్పటికీ వాయిదా పడటంతో ఫ్యాన్స్ నిరాశ చెందుతున్నారు.



నాగ్‌కు పోటీగా కర్ణ!

'కింగ్ 100' . రా. కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న ఈ భారీ యాక్షన్ డ్రామాను అక్కినేని కాంపౌండ్ తమ సొంత బ్యానర్ అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఐశ్వర్య రాజేష్, సుమ్మిత భట్, విజయేంద్ర ఈ చిత్రంలో కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఇక ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ అద్భుతమైన మ్యూజిక్ అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ వీడియోలు, పోస్టర్లు సినిమాపై అంచనాలను పెంచాయి.

కొద్దిరోజుల క్రితమే మహంతి ఝాన్సీ రాణిగా సీనియర్ నటి టబు పవర్‌ఫుల్ పాత్రను పరిచయం చేస్తూ గ్లింప్స్ వదిలిన చిత్ర యూనిట్, తాజాగా తమిళ టాలెంటెడ్ నటుడు అశోక్ సెల్వన్ ఈ ప్రాజెక్ట్‌లో భాగమైనట్లు అధికారికంగా ప్రకటించింది. అశోక్ సెల్వన్ నటిస్తున్న క్యారెక్టర్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమాలో అశోక్ సెల్వన్ 'కర్ణ' అనే నెగెటివ్ షేడ్స్ ఉన్న ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తున్నారు. నాగార్జునకు పోటీగా అశోక్ సెల్వన్ విలన్ అవతారంలో నటిస్తుండటంతో అభిమానుల్లోనూ, ప్రేక్షకుల్లోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కాగా.. ఈ చిత్రాన్ని ఈ ఏడాది క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ ఏర్పాట్లు చేస్తున్నారు.



విమర్శల మధ్య వసూళ్ల వర్షం!

నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కిన ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ' బాక్సాఫీస్ వద్ద క్రమంగా పుంజుకుని అద్భుతమైన రికార్డులను సృష్టిస్తోంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా తొలి రోజు కాస్త సాధారణ వసూళ్లను రాబట్టినప్పటికీ, ప్రేక్షకుల పాజిటివ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. ముఖ్యంగా శనివారం, ఆదివారం వారాంతపు సెలవుదినాల్లో కలెక్షన్స్ ఊపందుకోవడంతో ఈ చిత్రం సరికొత్త మైలురాయిని చేరుకున్నట్లు సమాచారం. రణబీర్ కపూర్ రాముడిగా, కన్నడ స్టార్ యశ్ రావణుడిగా నటించిన ఈ భారీ బడ్జెట్ చిత్రం విడుదలైన కేవలం నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 500 కోట్ల మార్క్‌ను చేరుకోవడం విశేషం.

దీపావళి పండుగ హాలిడేస్ అడ్వాంటేజ్‌తో ఇండియాలో లాంగ్ వీకెండ్‌లో రూ. 238.85 కోట్ల నెట్ వసూళ్లను రాబట్టినట్లు టాక్. అయితే, యశ్‌కు స్టార్ హోదా ఉన్నప్పటికీ కన్నడ వెర్షన్ ఆశించిన స్థాయిలో మెప్పించలేక కేవలం రూ. 7.50 కోట్లు మాత్రమే రాబట్టడం కొద్దిగా నిరాశపరిచినా, ఓవర్సీస్ మార్కెట్‌లో సోనీ పిక్చర్స్ భారీ రిలీజ్ ద్వారా సుమారు 23.7 మిలియన్లకు పైగా వసూలు చేసి విదేశాల్లోనూ తన జోరును ప్రదర్శించింది. ప్రపంచవ్యాప్తంగా నాలుగు రోజుల్లో మొత్తం కలెక్షన్లు రూ. 499.20 కోట్లకు చేరుకున్నాయి . అయితే ఈ సినిమాపై విమర్శలు వస్తున్నప్పటికీ.. అంతకు మించిన వసూళ్లు రాబట్టుకోవడంతో 'రామాయణ' పేరు సోషల్ మీడియాలో మార్మోగిపోతోంది.



'ధర్మన్'లో రామ్ మాస్ గ్లింప్స్!

సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్, మోస్ట్ అవైటెడ్ మూవీ 'ధర్మన్'. 'ఓ మై కడవులే' ఫేమ్ అశ్వత్ మారిముత్తు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇక ఈ సినిమాలో రజినీకాంత్ ఒక పవర్‌ఫుల్ డాక్టర్ పాత్రలో కనిపించబోతుండటం విశేషం. ఇక ఈ భారీ ప్రాజెక్ట్‌లో రాశి ఖన్నా, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తుండగా, సీనియర్ నటి సిమ్రాన్, యోగిబాబు కీలక పాత్రల్లో అలరించనున్నారు. అలాగే టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని ఈ సినిమాలో ఒక శక్తివంతమైన పాత్రలో నటిస్తూ ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేయనున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ క్రమంలోనే రామ్ పోతినేనికి సంబంధించిన స్పెషల్ గ్లింప్స్ వీడియోను మేకర్స్ తాజాగా విడుదల చేశారు.

'రా యాటిట్యూడ్.. పవర్.. ఓవర్‌లోడెడ్.. అందరికీ స్వాగతం' అంటూ మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్, వీడియోలో రామ్ పోతినేని చూపించిన మాస్ యాటిట్యూడ్ సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఈ గ్లింప్స్ నెట్టింట తీవ్రంగా వైరల్ అవుతోంది. ఈ సినిమాలో రామ్ పోతినేని రాశి ఖన్నాకు జోడీగా నటిస్తున్నట్లు టాక్. ఈ చిత్రాన్ని విలక్షణ నటుడు కమల్ హాసన్, మహేంద్రన్ సంయుక్తంగా తమ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సూపర్ స్టార్ రజినీకాంత్ మాస్ ఇమేజ్‌కు, రామ్ పోతినేని ఎనర్జీ తోడవడంతో ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అన్ని కార్యక్రమాలను శరవేగంగా పూర్తి చేసి, ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను వచ్చే సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

